అతివల మహదానందం

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభం
- హర్షం వ్యక్తం చేసిన మహిళలు
- బస్సుల్లో మిఠాయిల పంపిణీ


చాంద్రాయణగుట్టలో ..


మెహిదీపట్నంలో.. డిపో మేనేజర్ మూర్తి

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పిన మాదిరిగానే.. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా శనివారం నుంచి అమలు పరచడం పట్ల పాతబస్తీలోని మహిళా ప్రయాణికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పాతబస్తీ నుంచి నిత్యం వేల సంఖ్యలో మహిళలు ఉద్యోగాలు, ఇతర పనుల కోసం ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ఆటోలను ఆశ్రయిస్తుంటారు. శనివారం మధ్యాహ్నం నుంచి బస్సులలో ఉచిత ప్రయాణం అమలులోకి రావడంతో మహిళలు ఆటోలలో కాకుండా 90 శాతం వరకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించారు. దీంతో బస్సులలో 60 శాతానికి పైబడి మహిళా ప్రయాణికులే కనిపించారు. ముఖ్యంగా పాతబస్తీలో ఫలక్‌నుమా, ఫారూక్‌నగర్, మిధాని ఆర్టీసీ బస్సు డిపోలు పెద్ద ఎత్తున బస్సులను ఆపరేట్ చేస్తుంటాయి. ఈ ఉచిత సదుపాయంతో నెలకు దాదాపు రూ.2 వేల వరకు ఆదా అవుతాయని.. మహిళా పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు.

ఆటోవాలాల ఆవేదన..

నగర వ్యాప్తంగా సాధారణంగా మహిళలు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తుంటారు. కాని శనివారం మధ్యాహ్నం నుంచి బస్సులలో ఉచిత ప్రయాణం ప్రారంభం కావడంతో ఆటోవాలాలకు గిరాకీ తగ్గిపోయింది. తొలిరోజు కాస్త అటు.. ఇటుగా ఉన్నప్పటికీ, రేపటి నుంచి ఎలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి ఆటోవాలాలకు ఏదో రకంగా న్యాయం చేయాలని ఆటోవాలాలు కోరుతున్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై హర్షాతిరేకాలు..

గోల్కొండ: ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని పురస్కరించుకొని పలు బస్టాప్‌ల వద్ద భారీ ఎత్తున మహిళలు బారులు తీరారు. మెహిదీపట్నం, నానల్‌నగర్, టోలిచౌకీ చౌరస్తా, షేక్‌పేట్ నాలా తదితర బస్టాప్‌ల వద్దకు బారులు తీరారు. కళాశాలు, పాఠశాలలకు సెలవు రోజు కావడంతో విద్యార్థినులు కనిపించలేదు. కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై మిఠాయిలు పంచిపెట్టారు. మెహిదీపట్నం ఆర్టీసీ బస్సు డిపో వద్ద మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తి, సైఫాబాద్ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నవనీత హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మెట్రో రైలులో కూడా ప్రయాణించే అవకాశం కల్పించాలి..



ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించడం సంతోషదాయకం. నిరుపేదలు, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతగానో మేలు చేకూర్చుతుంది. ఇలాంటి పథకాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు రుణపడి ఉంటారు. మెట్రోలో కూడా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలి. - డాక్టర్ సునీతా గ్రేస్, వైద్యురాలు

ఇతర రాష్ట్రాల వారికి ఈ పథకం ఆదర్శం కావాలి



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం హర్షనీయం. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం అభినందనీయం. దీన్ని వల్ల ప్రతి నెలా తాము బస్‌పాస్ కోసం డబ్బులు పెట్టే అవసరం ఉండదు. ఇతర రాష్ట్రాల వారికి ఈ పథకం ఆదర్శం కావాలి. - షాజిదాబేగం, గృహిణి, గోల్కొండ

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకుంది



ఇచ్చిన హామీలను నిలపెట్టుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించి ఆరు గ్యారంటీ హామీలలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఒకటి. ఇది నేడు ప్రారంభం కావడం కాంగ్రెస్ పార్టీ నిజాయితీకి నిదర్శనం. - అను, కార్వాన్

ఆరంభ శూరత్వం కాకూడదు..



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రవేశాలను కల్పించడంతో నగరంలోని ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వీరి సంఖ్య అధికంగా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మంచి పథకాన్ని ప్రవేశ పెట్టడం బాగానే ఉన్నా ప్రయాణికుల రాకపోకలపై మరింత లోతైన అధ్యయనం జరగాలి. కొత్త సంస్కరణలతో ఆర్టీసీని ముందుకు నడిపించాలి. ఈ పథకంతో ఆర్టీసీకి నష్టం వాటిల్లకుండా, పథకం ఆరంభ శూరత్వం కాకూడదు. - జి.పల్లవి, గృహిణి

అంతర్గత బస్తీలకు బస్సులు నడపాలి..



మాది ఉప్పుగూడ కృష్ణారెడ్డి నగర్. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పని చేస్తా. నిత్యం రానుపోను రూ.60లు బస్సు టికెట్ల ఖర్చు అవుతోంది. ఈరోజు సాయంత్రం బస్సులో ఉచితంగా రావడం సంతోషంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులను ఉప్పుగూడ జెండా వరకు నడిపినట్లయితే మాకు అనుకూలంగా ఉంటుంది. ఈ పథకాన్ని ఇలాగే కొనసాగించాలి. - సత్యమ్మ, ఉప్పుగూడ

కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు..




మాది సంగారెడ్డి జిల్లా సదాశివపేట. ఫలక్‌నుమాలోని గురుకుల కళాశాలలో నా కూతురు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈరోజు చూసి పోదామని నా చిన్న కూతురుతో కలిసి వచ్చా. ఇలా వచ్చినప్పుడల్లా మూడు బస్సులు మారాల్సి వస్తుండడంతో మాకు బస్సు కిరాయిలకే రూ.వెయ్యి ఖర్చవుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మా లాంటి వారికి ఎంతో మేలు జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు. –సువర్ణ, సదాశివపేట

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి


శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న నిర్మల్ కుమార్ యాదవ్, గోకరణ్ సింగ్

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్, గోషామహల్ కాంగ్రెస్ నాయకులు గోకరణ్ సింగ్, అర్జున్‌యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రిగా ఎంపికైన డి.శ్రీధర్‌బాబును వారు ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం దోపిడీలకు పాల్పడ్డారన్నారు. అవినీతి, అక్రమాలతో తెలంగాణను అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు.

తలసానికి సత్కారం


తలసానిని సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్ రావు, రాంచంద్రరాజ్

అబిడ్స్: బీఆర్ఎస్ నూతన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తమ్ రావు, రాంచంద్రరాజ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లుగా మంత్రిగా తలసాని ఉన్నప్పుడే గోషామహల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత తలసానిదే అన్నారు. బేగంబజార్‌లో ఫిష్‌మార్కెట్ నిర్మాణం, గోషామహల్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు కోట్ల రూపాయలతో మంత్రి తలసాని నిర్మించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌తోనే గోషామహల్ అభివృద్ధి కొనసాగిందన్నారు.

'ఏడు సీట్లు గెలవడం గర్వంగా ఉంది'


ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

చార్మినార్: ఈసారి జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో దూద్‌బౌలికి చెందిన మజ్లిస్ పార్టీ నాయకులైన తండ్రీకొడుకులు రాజేశ్వర్‌రావు, ఆర్.దీపేష్ రాజ్ వర్మ శనివారం దారుస్సలాంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. నగరంలోని ఏడు శాసన సభ నియోజకవర్గాల నుంచి మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలుగా నిలవడం గర్వంగా ఉందనే విషయాన్ని ఎంపీకి తెలియజేశామన్నారు.

రాబోయే కాలంలో ఎలక్ట్రిక్ వెహికిల్స్‌దే హవా


మల్లెపల్లి ఐటీఐలో ఎలక్ట్రిక్ వెహికిల్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విజయనగర్‌కాలనీ: భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వెహికిల్స్ వినియోగం పూర్తిస్థాయిలో తీసుకురావాలని ఉపాధి శిక్షణశాఖ రిజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్యారం నర్సయ్య, కళాశాల ప్రిన్సిపల్ పుష్పాల జ్యోతిరాణి అన్నారు. శనివారం మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మైక్రోసాఫ్ట్, టీఎస్ఎస్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో సోలార్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణతో పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఢిల్లీలో వాయు కాలుష్యం పెచ్చుమీరడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అంతే కాకుండా శ్వాస సంబంధమైన రోగులు ఎందరో అనేక సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. అటువంటి పరిస్థితి మన రాష్ట్రంలో రాకుండా ఉండాలంటే ఎలక్ట్రిక్ వెహికిల్స్ వినియోగం పెరగాలన్నారు. విద్యుత్ వాహనాలకు సంబంధించిన మరమ్మతులు నిర్వహించేందుకు మల్లేపల్లి ఐటీఐలో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. వివిధ సంస్థల ప్రతినిధులు ప్రిన్సిపల్స్, ట్రైనింగ్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు


విజేతలతో హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీ కోచ్ హబీబ్ ముస్తఫా

చార్మినార్: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంటర్ కాలేజ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో పాతబస్తీకి చెందిన హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీకి చెందిన విద్యార్థులు 5 గోల్డ్ మెడల్స్ సాధించారు. నిజాం కాలేజీ బాక్సింగ్ హాల్‌లో రెండు రోజుల క్రితం జరిగిన ఈ పోటీల్లో పాతబస్తీకి చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడం పట్ల కోచ్ హబీబ్ ముస్తఫా వారందరిని శనివారం అభినందించారు. మహ్మద్ ఓమర్, మహ్మద్ బిలాల్, సయ్యద్ సమీర్,అదనాన్ అన్వర్ ఖాన్, అబ్దుల్లా బిన్ జావీద్ జాఫ్రీ తదితరులు గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ హబీబ్ ముస్తఫా తెలిపారు. అలాగే టీం చాంపియన్‌షిప్ అన్వర్ ఉల్ ఉలూం కాలేజీకి దక్కిందన్నారు.

మొక్కు చెల్లించుకున్న ఆర్టీసీ కార్మికులు


ఫలక్‌నుమా డిపోలో కొబ్బరికాయలు కొడుతున్న కార్మికులు

చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ కార్మికులకు అన్యాయం చేయడంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓటమి పాలయ్యారని ఫలక్‌నుమా బస్సు డిపో కార్మికులు పేర్కొన్నారు. కేసీఆర్ ఓటమి చెంది.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమ్మవారి ఆలయంలో 51 కొబ్బరి కాయలు కొడుతానని మొక్కుకున్న ఆర్టీసీ డ్రైవర్ విష్ణువర్ధన్‌రెడ్డి..శనివారం తోటి కార్మికులతో కలిసి డిపో ఆవరణలో ఉన్న దుర్గామాత అమ్మవారి ఆలయంలో 51 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం తిరిగి యూనియన్లను అందుబాటులోకి తీసుకురావాలన్నా రు. ఈ కార్యక్రమంలో రవీందర్, గులాం, గౌస్, మహ్మద్ కరీముద్దీన్, చారి, చెన్నయ్య, విజయలక్ష్మి, సునీత, రమాదేవి, సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌కు ఎవరూ సాటి రారు'


ముత్యాల భాస్కర్

గోల్కొండ: మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఎవరూ సాటిరారని కార్వాన్ బీజేపీ సీనియర్ నాయకులు ముత్యాల భాస్కర్ అన్నారు. పదేళ్ల తన పరిపాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రరాష్ట్రంగా తీర్చిదిద్దింది కేసీఆర్‌యే అని ఆయన అన్నారు. విద్యా రంగంలో ఎన్నో మార్పులు తెచ్చిన తెలంగాణ ముద్దుబిడ్డ కేసీఆర్ అని ఆయన అన్నారు. నేడు తెలంగాణ వైద్య, విద్యా రంగంలో దేశంలోనే అగ్రరాష్ట్రంగా ఉందని దాదాపు ప్రతి జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించిన కేసీఆర్ నెంబర్ వన్ నాయకుడని ఆయన అన్నారు.

సమాజానికి మంచి పుస్తకాలు అవసరం


కార్యక్రమంలో హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సమాజానికి మంచి పుస్తకాలు రావాలని ఆ పుస్తకాలు రాబోయే తరానికి ఆదర్శంగా ఉండాలని ప్రముఖ రచయిత పి.హరికృష్ణ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సంస్కృతి పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రచయితల నుంచి మంచి రచనలు రావాలని సూచించారు. అనంతరం 50 నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, రచయితలు రామకృష్ణ, చంద్రమౌళి, బడేసాబ్ పాల్గొన్నారు.

కార్వాన్ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న సంఘ సేవకుడు డీవీఎస్ రాజు

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం సంఘసేవకుడు డీవీఎస్ రాజు ఆధ్వర్యంలో జియాగూడకు చెందిన మోచీ సమాజ్, రజక్ సమాజ్ ప్రతినిధులు ఎమ్మెల్యే కౌసర్‌ను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘసేవకుడు డీవీఎస్ రాజు మాట్లాడుతూ..జియాగూడలో సమాజ్‌ల అభ్యున్నతికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

మహాలక్ష్మి అమలుపై సంబరాలు

దూద్ బౌలి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీలో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని శనివారం ప్రారంభించడం పట్ల పాతబస్తీలో మహిళలు సంబరాలు జరుపుకొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వానికి పాతబస్తీ మహిళలు ధన్యవాదాలు తెలిపారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తమకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషంగా ఉందని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ (రాహుల్)కు స్థానిక మహిళలు మిఠాయిలు తినిపించి ధన్యవాదాలు తెలిపారు. రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో తమ పార్టీ పేర్కొన్న ఆరు గ్యారంటీలను అంచెలంచెలుగా కచ్చితంగా అమలు చేస్తామన్నారు.

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి సన్మానం


కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డితో ఉమామహేంద్ర తదితరులు

చార్మినార్: కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని పాతబస్తీ బీజేపీ నాయకులు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద సన్మానించారు. శనివారం ఉదయం భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు పాతబస్తీ బీజేపీ సీనియర్ నాయకులు టి.ఉమామహేంద్ర, సురేందర్ తదితరుల బృందం శాలువా కప్పి బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దశరథ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్ నాయకులు మరింత క్రియాశీలకంగా పని చేయాలి


మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు మరింత క్రియాశీలకంగా పని చేయాల్సిన అవసరం ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ వద్ద మజ్లిస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి కార్వాన్ నియోజకవర్గం నుంచి తాను మరోసారి ఎన్నికైయ్యానని అయితే తనపై నమ్మకం ఉంచి ప్రజలు మరోసారి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇటువంటి సమయంలో ప్రతిఒక్క మజ్లిస్ కార్యకర్త ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను తెలుసుకోవాలని ఆయన అన్నారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆయన అన్నారు. అవసరమైతే తన దృష్టికి కూడా తీసుకువస్తే వాటిని వెంటవెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ సీనియర్ నాయకులు సయ్యద్ వజాహత్ ఆలీ, మిర్జా ఎక్‌బాల్ అహ్మద్, మిన్‌హాజ్, ఇలియాజ్, ఖాదర్ తదితరులున్నారు.

జీఎన్ఐటీఎస్‌లో మాక్ పార్లమెంట్


మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థినులతో అధ్యాపకులు

గోల్కొండ: విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని న్యూ ఢిల్లీలోని సౌత్ బ్లాక్ విశ్రాంత సివిల్ సర్వెంట్, కిస్సన్ ల్యాబ్స్ కోఫౌండర్ కిషోర్ పోరెడ్డి అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ విద్యార్థినులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. దీనిని ప్రారంభించిన కిషోర్ పోరెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రియాంబుల్ ప్రతి ఒక్క విద్యార్థికి తెలిసి ఉండాలని అన్నారు. భారత దేశంలో మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతుందని చట్టసభల్లో వారికి రిజర్వేషన్లు కూడా కల్పించబడ్డాయన్నారు. ఈ అవకాశాన్ని ఉన్నత చదువులు చదివిన యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ మాధవీలత, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ అనురాధా, డాక్టర్ ఉదయభాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను భావి తరాలకు అందించాలి


అఘోరి గురురాజస్వామిని సత్కరిస్తున్న బజరంగ్‌సేనా ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని అఘోరి గురురాజస్వామి సూచించారు. బజరంగ్‌సేనా ఆధ్వర్యంలో స్వామీజీని కలిసి వారి సందేశాన్ని ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని మరువవద్దని తెలిపారు. అన్ని దేశాల కన్నా భారతీయ సంస్కృతికి ఎంతో పేరు ఉందన్నారు. ఇలాంటి విషయాలు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నందుకిశోర్ అగర్వాల్, మనోజ్, ప్రియ, రఘు, కరణ్, రామేశ్వర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. పలుచోట్ల సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలు ప్రాంతాల్లో పేదలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. - అబిడ్స్, చార్మినార్ మెహిదీపట్నం జోన్ల బృందం


వేడుకల్లో మణిలాల్‌షా, రాజేందర్‌యాదవ్


ఎస్సీ,ఎస్టీ హాస్టల్‌లో పండ్ల పంపిణీ


డోర్‌బస్తీ అంగన్‌వాడీలో.. వినోద్ చౌగ్లే


చార్మినార్ వద్ద..


వేడుకల్లో వెంకటేశ్ తదితరులు

వైభవంగా దీపారాధన



నాంపల్లి: బ్రహ్మ క్షత్రియ సమాజము తరఫున దేశాయి పరివార సభ్యులు కిషన్‌భాగ్‌లోని మురళి మనోహర మందిరం శనివారం 1500 దీపాలతో జ్యోతి ప్రజ్వలింపజేశారు. బ్రహ్మ క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో గత పదేళ్లుగా ఈ యజ్ఞాన్ని చేపడుతున్నారు. భాగ్యనగరంలోని ప్రధాన ఆలయాలైన కాలే హనుమాన్ (అత్తాపూర్), హనుమాన్ ఆలయం (విజయనగర్ కాలనీ), బాల త్రిపురసుందరి ఆలయం (అబిడ్స్), ఏడుగుళ్ల అమ్మవారి ఆలయం (బజార్‌ఘాట్), సాయిబాబా ఆలయం (గుడిమల్కాపూర్)లలో చేపట్టారు. వచ్చే ఏడాది (మౌంట్ ఒపెరా) దేశ్‌ముఖ్ గ్రామంలోని సాయి బృందావన మందిరంలో చేస్తున్నట్లు పరివార సభ్యులు సంతోష్‌రాణి దేశాయి, రాజ్‌మోహన్‌లాల్ దేశాయి, స్పర్శ, వందన, పద్మ, రామ్‌మోహన్‌లాల్ దేశాయి తెలిపారు.

పాతబస్తీలో పర్యాటకుల సందడి


చార్మినార్-గుల్జార్‌హౌస్ రోడ్డులో..

చార్మినార్: పాతబస్తీలో శనివారం సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. తమ కుటుంబసభ్యులతో కలిసి చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూ పార్కు, నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. చిరు వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. గుల్జార్‌హౌస్ ఫౌంటేన్ వద్ద యధావిధిగా ట్రాఫిక్ జాంలు తప్ప లేదు.

డ్రైనేజీ పనుల పునరుద్ధరణ



నాంపల్లి: పాడైపోయిన డ్రైనేజీ కాలువ పనులను పునరుద్ధరించారు. ఎంతో కాలంగా సయ్యద్ అలీగూడలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ పర్యవేక్షణలో ఏరియా అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ రజ్వీ మాజిద్ పనులను చేయించారు. డ్రైనేజీ పనుల ఆధునీకరణతో స్థానిక బస్తీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తికి రిమాండ్

సంతోష్‌నగర్: ఇళ్ల తాళలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా జహనుమా నవాబ్‌సాబ్‌కుంట ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆరీఫ్ (37) తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సంతోష్‌నగర్ మోయిన్‌బాగ్‌కు చెందిన ఫిర్దోస్ బేగం ఈనెల 5న సోదరి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూసేందుకు ఆసిఫ్‌నగర్ జిర్రాకు వెళ్లింది. గమనించిన మహ్మద్ ఆరీఫ్ ఫిర్దోస్ బేగం ఇంటి తాళాలను పగలగొట్టి 19 గ్రాముల నెక్లెస్, 21 గ్రాముల లచ్చా, 5 గ్రాముల చైన్, 5 గ్రాముల బంగారు ఉంగరంతో పాటు కొంత నగదును దోచుకెళ్లాడు. మరుసటి రోజు ఇంటికి వచ్చిన బాధితురాలు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీకి పాల్పడిన మహ్మద్ ఆరీఫ్‌ను శనివారం సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంతోష్‌నగర్ పోలీసులతో కలిసి అరెస్ట్ చేసి బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. విలేకర్ల సమావేశంలో సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబు, ఎస్సైలు పి.సాయిరాం, సి.రాఘవేంద్ర రెడ్డి, పీసీలు నయీం ఖాన్, ఆర్.విజయ్ రాజ్, పాల్గొన్నారు.